TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 104 | బుధవారం, ఆగస్టు 14, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### రామ్‌దేవ్ బాబాపై ధిక్కరణ...

## కేసు మూసివేత

న్యూఢిల్లీ : తప్పుదారి పట్టిస్తున్న వాణిజ్య ప్రకటనల కేసులో యోగా గురు బాబా రామ్‌దేవ్, ఆయన సహాయకుడు బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సమర్పించిన క్షమాపణను సుప్రీం కోర్టు అంగీకరించిన పిదప వారిపై ధిక్కరణ కేసును మంగళవారం మూసివేసింది. 'రామ్‌దేవ్, బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సమర్పించిన క్షమాపణలు ప్రాతిపదికగా కోర్టు ధిక్కరణ చర్యలకు స్వస్తి పలికింది' అని యోగా గురు రామ్‌దేవ్, బాలకృష్ణ, పతంజలి సంస్థకు ప్రాతినిధ్యం వహించిన న్యాయవాది గౌతమ్ తాలుక్‌దార్ వెల్లడించారు. ధిక్కరణ నోటీస్‌పై తన ఉత్తర్వును సర్వోన్నత న్యాయస్థానం మే 14న రిజర్వ్ చేసింది. కొవిడ్ టీకాల కార్యక్రమం, ఆధునిక వైద్య విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ భారతీయ వైద్య సంఘం (ఐఎంఎ) దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ జరిపింది.



### హిండెన్‌బర్గ్ ఆరోపణలపై...

## సుప్రీం కోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఆరోపణలపై తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌ను నమోదు చేయడానికి సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ నిరాకరించినట్టు పిటిషనర్ ఫిర్యాదు చేశారు. పిటిషన్ దరఖాస్తులను నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించాలని సుప్రీం కోర్టును కోరారు. అదానీ గ్రూప్ కంపెనీలకు వ్యతిరేకంగా అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన మోసం ఆరోపణలను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలపై సెబీ నుంచి స్టేటస్ రిపోర్ట్ కోరిన దరఖాస్తును జాబితా చేయడానికి కోర్టు రిజిస్ట్రీ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో ఓ న్యాయవాది అప్పీలు చేశారు. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన అప్పీల్‌లో జనవరి 3న నాటి ఆదేశాలలో సుప్రీం కోర్టు తన విచారణను పూర్తి చేయడానికి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజి బోర్డు ఆఫ్ ఇండియా (సెబి) కి మూడు నెలల గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ చేసిన స్టాక్ మానిప్యులేషన్ ఆరోపణలపై జోక్యం చేసుకోవడానికి లేదా తదుపరి చర్యలకు ఆదేశించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది.




### 2036 నాటికి...

## 152.2 కోట్లకు చేరనున్న జనాభా

న్యూఢిల్లీ: భారత జనాభా 2036 నాటికి 152.2 కోట్లకు పెరుగనున్నది. అంతేకాదు మహిళల జనాభా శాతం కూడా కాస్త మెరుగుపడనున్నది. 2011లో 48.5 శాతం ఉండగా అది 48.8 శాతానికి పెరుగనున్నది. ఈ విషయాన్ని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. 'విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2023' నివేదిక 15 ఏళ్ల లోపు ఉన్న లింగ నిష్పత్తి తేడా చాలా వరకు తగ్గిపోనుందని పేర్కొంది.



ఫెర్టిలిటీ రేట్ కూడా పడిపోయే అవకాశం ఉందని రిపోర్టు పేర్కొంది. కాగా 60 ఏళ్ల కన్నా ఎక్కువ ఉండేవారి జనాభా పెరుగనున్నట్లు రిపోర్టు తెలిపింది. 2036 నాటికి ప్రతి 1000 మంది పురుషులకు 943 మంది మహిళలు ఉండనున్నారని ప్రాజెక్ట్ చేసింది.

### కాగ్నిజెంట్ విస్తరణకు...


## ముహూర్తం ఫిక్స్

హైదరాబాద్ : ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్ లో తమ కొత్త క్యాంపస్ ను రేపు శంకుస్థాపన చేయనుంది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకొని రేపు హైదరాబాద్ రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కంపెనీ విస్తరణకు శ్రీకారం చుట్టనున్నారు. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇది ఇలా ఉంటే రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ కంపెనీ సీఈవో రవికుమార్ తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేస్తుంది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది.



### తుంగభద్ర డ్యామ్‌కు తాత్కాలిక గేటు ఏర్పాటుకు

## సన్నాహాలు



కొప్పల్(కర్నాటక): తుంగభద్ర డ్యామ్ కు 33 క్రెస్ట్ గేట్లు ఉన్నాయి. అందులో ఒకటి శనివారం సాయంత్రం(ఆగస్టు 10న) కొట్టుకుపోయింది. డ్యామ్ లో మూడింట రెండు వంతుల నీరు ఖాళీ అయ్యాకే మరమ్మతు పనులు సాధ్యమని అంతా భావించారు. కర్నాటక ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కూడా ఆదివారం వెళ్లి చూశారు. ఇదిలావుండగా కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చేందుకు చర్యలు చేపట్టడం సాహసమేనని నిపుణులు తెలిపారు. 19వ నంబర్ గేటు స్థానంలో 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు ఉన్న భారీ గేటును అమర్చేందుకు సిద్ధం అయ్యారు. నీరు ప్రవహిస్తుండగానే దీన్ని ఏర్పాటు చేయబోతున్నారు. పనుల బాధ్యతలు జిందాల్ తో పాటు మరో రెండు సంస్థలకు అప్పగించారు. గేటు ముక్కలను తయారుచేసి తుంగభద్ర డ్యామ్ వద్దకు తీసుకొచ్చే చర్యలు చేపట్టారు.

### ఆగస్ట్ 15న చివరి విడత

## రుణమాఫీ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. ఆగస్ట్ 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసి చూపించారు. రాష్ట్రంలో మొత్తం 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పింది. జులై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం.. మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. జులై 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 11,14,412 మంది రైతులకు రూ.6034.97 కోట్లు విడుదల చేసింది. జులై 30వ తేదీన అసెంబ్లీ వేదికగా రెండో విడత రుణమాఫీ కార్యక్రమం అమలు చేసింది. ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. దాదాపు 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ చేసింది.

## హ్యుందాయ్ మెగా అడుగులు

హైదరాబాద్ : తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సియోల్లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు.

ఈ నేపథ్యంలోనే దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ భారతీయ విభాగమైన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎంఐఈ) ద్వారా తెలంగాణలో కారు మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించాలని ప్రణాళికలు రచిస్తోంది.

మెగా టెస్ట్ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు ఆధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం (ఈవీలు) కూడా ఉంటాయి. అలాగే హైదరాబాద్‌లో ఉన్న ఇంజనీరింగ్ కేంద్రం పునరుద్ధరణ, ఆధునీకరణ, విస్తరణ ద్వారా హెచ్ఎంఐఈ భారతదేశం సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మరింత ఉపాధిని కల్పించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబులతో చర్చల అనంతరం హెచ్ఎంఐఈ ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశం తమకు చాలా ముఖ్యమైన మార్కెట్ అని, భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ సెట్టింగ్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు. ఆధునిక పరీక్షా సౌకర్యాలు అభివృద్ధి చేసేందుకు తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హెచ్ఎంఐఈ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి పెట్టుబడులను తెలంగాణ లో పెట్టించేందుకు తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టాలని ప్రణాళిక రచిస్తోందన్నారు. రాష్ట్రం అనుసరిస్తున్న పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో ప్రగతిశీల, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్ఎంఐఈ వంటి అత్యున్నత కంపెనీలు ముందుకు వస్తున్నాయని సిఎం రేవంత్ తెలిపారు. హెచ్ఎంఐఈ మెగా టెస్ట్ సెంటర్ సమీపంలోని సౌకర్యాలు ఇతర అనుబంధ సంస్థలు, సరఫరాదారులను ఆకర్షించే అవకాశం ఉందని, ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని ఆయన తెలిపారు.

**త్వరలోనే తెలంగాణలో పర్యటించేందుకు ఎల్ఎస్ కార్ప్ సుముఖత**

తెలంగాణకు పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సౌత్ కొరియాలో బిజీ బిజీగా గడుపుతోంది. అమెరికా పర్యటనను విజయవంతంగా ముంగించుకొని దక్షిణ కోరియా చేరుకున్న ముఖ్యమంత్రి బృందం సోమవారం సియోల్ లో వివిధ సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ క్రమంలో కొరియాలోని అతిపెద్ద పారిశ్రామిక సమ్మేళనాల్లో ఒకటైన ఎల్ఎస్ కార్ప్ (గతంలో ఎల్‌జీ గ్రూప్‌లో భాగస్వామి) చైర్మన్ కూ జా యంగ్‌తో పాటు ఆ సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ కేబుల్, గ్యాస్, ఇంధన, బ్యాటరీల ఉత్పత్తిలో పెట్టుబడులపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు త్వరలో తెలంగాణలో పర్యటించేందుకు వారు సుముఖత వ్యక్తం చేసినట్టు ట్విట్టర్ వేదికగా సిఎంఓ తెలిపింది.



# హోంమంత్రి కైలాష్ గెహ్లోట్‌కు జెండా వందనం బాధ్యత



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఢిల్లీ ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే బాధ్యతను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జి) వికె సక్సేనా రాష్ట్ర హోం మంత్రి కైలాష్ గెహ్లోట్‌కు అప్పగించినట్లు రాజ్ నివాస్ అధికారులు మంగళవారం ప్రకటించారు. ఇతర సీనియర్ నాయకులను కాదని హోం మంత్రిని ఎంపిక చేయడంతో ఆప్ ప్రభుత్వానికి, ఎల్‌జి సచివాలయానికి మధ్య మరోసారి వివాదం చెలరేగే అవకాశం కనపడుతోంది. ఛత్రాసాల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుకలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు హోం మంత్రి కైలాష్ గెహ్లోట్‌ను నామినేట్ చేస్తున్నట్లు ఎల్‌జి సక్సేనా ఢిల్లీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నరేష్ కుమార్‌కు పంపిన లేఖలో తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని ఆయన ఆదేశించారు. అంతకుముందు.. తన తరుపున ఢిల్లీ మంత్రి అతిషికి జాతీయ పతాక ఆవిష్కరణ బాధ్యతను ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అప్పగించగా, అవినీతి కేసులో తీహార్ జైలులో ఉన్న ఆయనకు ఆ అధికారం లేదని సాధారణ పరిపాలన శాఖ(జిఎడి) స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అభీష్టం మేరకు జాతీయ జెండాను అతిషి ఆవిష్కరించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఢిల్లీ జిఎడి మంత్రి గోపాల్ రాయ్ సోమవారం జిఎడిని ఆదేశించారు. దీనిపై జిఎడి అదనపు ముఖ్య కార్యదర్శి నవీన్ కుమార్ చౌదరి మంగళవారం స్పందిస్తూ ముఖ్యమంత్రి ఆదేశాలు చట్టప్రకారం చెల్లవని, వాటిపై తాము చర్యలు తీసుకోలేమని చెప్పారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి ఆగస్టు 6న లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాకు రాసిన లేఖకు జైలు నిబంధనల ప్రకారం అనుమతి లేదని కూడా ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఎప్పటిలాగే ఛత్రసాల్ స్టేడియంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని చౌదరి తెలిపారు. ముఖ్యమంత్రి జుడిషియల్ కస్టడీలో ఉన్నందున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ఆయనకు సాధ్యపడదని, తదుపరి ఆదేశాల కోసం ఉన్నతాధికారులకు సమాచారం అందచేశామని యన తెలిపారు.

### మహిళా డాక్టర్ హత్య కేసు సిబిఐకి అప్పగించిన

# కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: ఒక మహిళా డాక్టర్‌పై హత్యాచారం కేసు దర్యాప్తును సిబిఐకి బదలాయించాలని కలకత్తా హైకోర్టు మంగళవారం ఆదేశించింది. కేసు డైరీని వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థకు అందజేయాలని, అన్ని ఇతర పత్రాలను బుధవారం ఉదయం 10 గంటలకల్లా అప్పగించాలని కోల్‌కతా పోలీసులను కోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్‌జి కర్ ఆసుపత్రి సెమినార్ హాల్ లోపల హత్యాచారానికి గురైన పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ మృత దేహం శుక్రవారం ఉదయం కనిపించింది. ఈ సందర్భంగా ఒక పౌర వాలంటీర్‌ను శనివారం అరెస్టు చేశారు. సమ్మె విరమించుకోవాలని ఆందోళనకారులైన వైద్యులకుహైకోర్టు విజప్తి చేసింది. వారిది 'పవిత్రమైన బాధ్యత' అని కోర్టు తెలిపింది. కాగా, ఆదిలోనే హత్య కేసు ఎందుకు దాఖలు చేయలేదని, అసహజ మరణం కేసు ఎందుకు నమోదు చేశారని హైకోర్టు ప్రశ్నించింది. హత్యపై వెంటనే ఫిర్యాదు ఏదీ రానందున అసహజ మరణం కేసు నమోదు చేసినట్లు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ న్యాయవాది చెప్పినప్పుడు ప్రధాన న్యాయమూర్తి టిఎస్ శివజ్ఞానం ఆయనకు ఆ ప్రశ్న వేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ మృతదేశం రోడ్డు పక్కన దొరకలేదని ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ గాని, ప్రిన్సిపాల్ గాని ఫిర్యాదు దాఖలు చేసి ఉండవలసిందని బెంచ్ అన్నది. న్యాయమూర్తి హిరణ్మయ్ భట్టాచార్య కూడా బెంచ్‌లో ఉన్నారు. ఈ కేసులో కోర్టు పర్యవేక్షిత దర్యాప్తు కోరుతూ పిజి ట్రైనీ తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. కేసుపై సిబిఐ దర్యాప్తు కోరుతూ పలు ఇతర పిల్‌లు కూడా దాఖలయ్యాయి. పిటిషన్లను బెంచ్ విచారిస్తూ, దర్యాప్తులో 'ఏదో లోటు ఉన్నట్లు కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించింది. అప్పటి వైద్య కళాశాల ప్రిన్సిపాల సందీప్ ఘోష్ వ్యాలాన్ని నమోదు చేశారా అని బెంచ్ ప్రశ్నించగా లేదని ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇచ్చారు. రాజీనామా చేసిన ఆర్‌జి కర్ ఆసుపత్రి ప్రిన్సిపాల్‌ను గంటల వ్యవధిలోనే కలకత్తా జాతీయ వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపాల్‌గా ఎలా తిరిగి నియమించారని బెంచ్ ప్రశ్నిస్తూ, రాజీనామా పత్రాన్ని, ఆతరువాతి నియామక పత్రాన్ని సమర్పించాలని ఆయన న్యాయవాదిని కోరింది. ఘోష్‌ను మధ్యాహ్నం 3 లోగా దీర్ఘకాల సెలవుపై వెళ్లవలసిందని




ఆయనను కోరవలసిందని, లేనిచో తామే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ఆయన న్యాయవాదితో హైకోర్టు చెప్పింది. హత్య అత్యంత కిరాతకమని, వైద్యులు, ఇంటర్న్‌లు తమ ఆవేదనను వ్యక్తం చేయడం సమర్థనీయమేనని కూడా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, ఇంటర్న్‌లు ఆ ఘటనకు నిరసన వ్యక్తంచేస్తూ, ఆసుపత్రి సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని కోరుతూ మంగళవారం తమ సమ్మె కొనసాగించారు. సమ్మె చేస్తున్న డాక్టర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని హైకోర్టు సూచించింది. ఇది ఇలా ఉండగా, కోల్‌కతా పోలీసులు ఈ కేసులో పారదర్శకంగా దర్యాప్తు సాగిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. పిటిషనర్ల న్యాయవాదులు కొందరు ఆరోపించినట్లుగా సాక్షాధారాలు ధ్వంసం కాకుండా ఎలా చూడగలరని ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించగా, కోల్‌కతా పోలీస్ అదనపు కమిషనర్ (ఐ) పర్యవేక్షణలో డిసిపి ర్యాంక్ అధికారి ఒకరు దర్యాప్తునకు సారథ్యం వహిస్తున్నారని ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇచ్చారు. బెంచ్ ఆదేశం మేరకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కేసు డైరీని మధ్యాహ్నం ఒంటి గంటకు సమర్పించింది.

### జీవో 33పై వివరణ ఇవ్వండి...

# ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు స్థానికత వివాదం మళ్లీ హైకోర్టుకు చేరింది. స్థానికతకు సంబంధించి మెడికల్, డెంటల్ కోర్సుల అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ జులై 19న ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గతేడాది ఇదే హైకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం నిబంధనలను సవరిస్తూ జీవో తీసుకువచ్చిందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ప్రస్తుత నిబంధన ప్రకారం అడ్మిషన్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలని నిబంధన తీసుకువచ్చారన్నారు. గతంలో 10వ తరగతి వరకు చదివి తల్లిదండ్రుల ఉద్యోగ, ఇతరత్రా ఇతర ప్రాంతాలకు వెళ్లిన సంద ర్భాల్లో ఇక్కడ శాశ్వత నివాసానికి సంబంధించి ఎమ్మార్వో ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఈ హైకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. దాని ప్రకారం గతేడాది అడ్మిషన్లు జరిగాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల సవరణ వల్ల స్థానికులకే తీవ్ర నష్టం వాటిల్లుతోందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టు వెల్లడి చేశారు. మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్ల నిమిత్తం దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం చివరి రోజు అని అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రతివాదుల వాదన వినకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ప్రతివాదులైన వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ, ఎన్టీఏలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 14వ తేదీకి వాయిదా వేసింది. జీవో 33పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33పై ఇటీవలే బిఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కెటిఆర్ స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 33 సంబంధించి తల్లిదండ్రులు, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని హరీశ్‌రావు పేర్కొన్నారు. వైద్యవిద్య కళాశాలల్లో అడ్మిషన్ల కోసం స్థానికత నిర్ధారించుకోడానికి ప్రభుత్వం కొత్త సమగ్ర విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యార్థులకు వైద్య సీట్లల్లో అన్యాయం చేస్తారా అని కెటిఆర్ ప్రశ్నించారు. స్థానికత విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలోని అంశాలు వేలితో విద్యార్థుల కళ్లను పొడిచినట్లే ఉన్నాయని విమర్శించారు.

### చెల్లెలిపై నా భార్య పోటీ చేయడం తప్పే:

# అజిత్ పవార్ ఆసక్తికర వ్యాఖ్యలు

ముంబై: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తన సోదరి సుప్రియా సూలెపై తన భార్య సునేత్ర పవార్‌ను పోటీకి నిలబెట్టి తప్పు చేశానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ పశ్చాత్తాపం ప్రకటించారు. రాజకీయాలు ఇంట్లోకి ప్రవేశించడానికి అనుమతించకూడదని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జన సమ్మాన్ యాత్ర చేపట్టిన అజిత్ పవార్ ఒక మరాఠీ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను సోదరీమణులందరినీ ప్రేమిస్తానని చెప్పారు. రాజకీయాలు ఇంట్లోకి ప్రవేశించడానికి ఎవరూ అనుమతించకూడదని ఆయన అన్నారు. తన సోదరికి వ్యతిరేకంగా తన భార్యను ఎన్నికల్లో పోటీ చేయించి తాను తప్పుచేశానని ఆయన అన్నారు. అలా జరగకుండా ఉండవలసిందని కూడా ఆయన చెప్పారు. అయితే ఎన్‌సిపి పార్లమెంటరీ బోర్డు ఆ నిర్ణయం తీసుకుందని, ఆ నిర్ణయం తప్పని తాను భావిస్తున్నానని అజిత్ పవార్ తెలిపారు. వచ్చేవారం రక్షాబంధన్ రోజున మీ సోదరి సుప్రియా సూలె కలసి రాఖీ కట్టించుకుంటారా అన్న ప్రశ్నకు తాను ప్రస్తుతం యాత్రలో ఉన్నానని, ఆ రోజున తన సోదరి, తాను ఒకే చోట ఉన్న పక్షంలో తప్పకుండా రాఖీ కట్టించుకుంటానని అజిత్ పవార్ వెల్లడించారు. అభివృద్ధి, రైతులు, మహిళలు, యువనులకు సంబంధించిన సంక్షేమ పథకాలపై తాను మాట్లాడతానని, తనపై చేసే విమర్శలకు స్పందించబోనని ఆయన



స్పష్టం చేశారు. తన బాబాయ్ శరద్ పవార్‌తో విభేదాల గురించి అడిగిన ప్రశ్నించగా ఆయన(శరద్ పవార్) సీనియర్ నాయకుడని, తమ కుటుంబ పెద్దని అజిత్ పవార్ తెలిపారు. ఆయన తనపై చేసే విమర్శలపై తాను వ్యాఖ్యానించబోనని అజిత్ పవార్ తెలిపారు. శరద్ పవార్‌పై అధికార బిజెపి, శివసేన చేస్తున్న ఆరోపణల గురించి ప్రశ్నించగా తాము ఏమి మాట్లాడుతున్నామో మహాయుతి భాగస్వామ్య పక్షాలు అర్థం చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. తాము సమావేశమైనపుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తానని ఆయన చెప్పారు.

## బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం: కెటిఆర్



హైదరాబాద్: బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు మంగళవారం నందినగర్ నివాసంలో కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. పోచారం శ్రీనివాస్ రెడ్డినీ అన్ని రకాలుగా గౌరవించిన పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందని వాపోయారు. అయితే కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని, వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కెటిఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు. గులాబి జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా%శా% గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బిఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కెటిఆర్‌కు తెలిపారు.

**ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం సంతోషం– : కెటిఆర్**

గురుకుల పాఠశాలల్లో సమస్యలపై ప్రభుత్వం మొత్తానికి స్పందించటంపై కెటిఆర్ స్పందించారు. గత 8 నెలల కాలంలో విషాహారం కారణంగా దాదాపు 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. విద్యార్థుల భోజనానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కెటిఆర్ సోమవారం ప్రభుత్వాన్ని కోరగా, మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ పాఠశాలలను సందర్శించారు. మంత్రులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల భోజనం సహా ఇతర అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కెటిఆర్ కోరారు. మొన్నటి వరకు కూడా అంతా బాగానే ఉందన్నట్లు మొద్దు నిద్రలో ఉన్న సర్కార్‌ను మేల్కొనేలా చేసినందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

గురుకుల పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలి

గురుకుల పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్నటువంటి పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థుల్లో భర్తీ చేయాలని కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు మంగళవారం కెటిఆర్‌ను ఆయన నివాసంలో కలసి వారి సమస్యలను వివరించారు. గురుకుల పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్నటువంటి పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థుల్లో భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని దీని కోసం ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని గురుకుల విద్యార్థులు కెటిఆర్‌ను కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తిపై కెటిఆర్ సానుకూలంగా స్పందించారు. గురుకుల విద్యార్థులకు, డిఎస్‌సి విద్యార్థుల తరఫున బిఆర్ఎస్ పార్టీగా అభ్యర్థులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు సిఎస్ శాంతి కుమారికి ఫోన్ చేసి వారి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో నకిలీ కరెన్సీ ముద్రిస్తున్న ముగ్గురి అరెస్టు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో నకిలీ నోట్లు ముద్రిస్తూ, సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు అనాస్ ఖాన్(20), అమన్ కుమార్(25), వికాస్ కుమార్(24) నుంచి రూ. 1.40 లక్షల విలువైన రూ. 200 కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు ద్వారక డిసిపి అంకిత్ సింగ్ మంగళవారం తెలిపారు. నకిలీ నోట్లను సరఫరా చేసేందుకు ద్వరకా మోర్ మెట్రో స్టేషన్ వద్దకు అనాస్ ఖాన్ వస్తున్నట్లు ఆగస్టు 5న తమకు సమాచారం అందిందని ఆయన చెప్పారు. మెట్రో స్టేషన్ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అతడిని తనిఖీ చేయగా రూ. 200 నకిలీ కరెన్సీ నోట్లు 301 దొరికినట్లు డిసిపి తెలిపారు. తనకు సోషల్ మీడియాలో ఒక వ్యక్తి పరిచయం అయ్యాడని, అతడికి నికలీ కరెన్సీని సరఫరా చేస్తున్నానని అనాస్ ఖాన్ దర్యాప్తులో చెప్పాడని ఆయన తెలిపారు. ఖాన్ వాంగ్మూలం ఆధారంగా ఆగస్టు 6న నికలీ నోట్లను అందచేయడానికి వచ్చిన వికాస్ కుమార్, అమన్ కుమార్‌లను పీరాగఢి మెట్రో స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. వికాస్ కుమార్ గతంలో హర్యానాలో కూడా అరెస్టయ్యాడని ఆయన తెలిపారు. వికాస్ కుమార్‌కు చెందిన డిసిఎం కాలనీలోని ఇంటి నుంచి మూడు మొబైల్ ఫోన్లు, నకిలీ భారతీయ కరెన్సీని ముద్రించడం కోసం ఉపయోగిస్తున్న రెండు ప్రింటర్లు, ఒక లాప్‌టాప్, ఫ్రేమ్, వాటర్ మార్క్, ఇంక్‌తోసహా ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి తెలిపారు. ముఠాలోని ఇతర సభ్యుల కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

## సంపాదకీయం

బుధవారం, ఆగస్టు 14, 2024

## క్రీమీలేయర్ కావాలని ఎవరడిగారు...?

ఎస్సీ వర్గంలోని వివిధ కులాల మధ్యన సైతం అంతరాలు ఉన్నాయని, అభివృద్ధిలో తేడాలు ఉన్నాయని చెబుతూ క్రీమీలేయర్‌ను ముందుకు తీసుకొచ్చారు. ఎస్సీ కులాల మధ్య అంతరాలు లేవని ఎవరూ వాదించడం లేదు. ఆ చేదు వాస్తవాన్ని అంబేద్కర్ సైతం అంగీకరించారు. వారందరూ అంటరానివారుగా బతికినా.. వారి మధ్యన సైతం ఎన్నో అంతరాలు ఉన్నాయని, వివక్ష సైతం ఉన్నదని ఆయన ఆనాడే గుర్తించాడు. అయితే ఈ అంతరాలను పుట్టించి, అమలు పరిచిన పాపం ఎవరిదనే మౌలిక ప్రశ్నను ఆయన వేశారు. ఈ నెల ఒకటిన కీలక తీర్పును వెలువరించిన సుప్రీంకోర్టు, రాష్ట్రాల వారీగా ఎస్సీ కులాల వర్గీకరణకు అనుమతినిచ్చింది. ఊహించిన విధంగానే, సుప్రీం తీర్పు భిన్న స్పందనలకి దారితీసింది. ముప్పై సంవత్సరాలుగా నానుతున్న ఒక సమస్యకు పరిష్కారం లభించిందని కొందరు స్వాగతిస్తే, ఈ సమస్యను పరిష్కరించడం తక్కువ, కొత్త సమస్యలకు తెర తీయడం ఎక్కువ జరిగిందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగంలో పొందుపరచబడిన సామాజిక న్యాయ సూత్రాలను నిర్వీర్యపరచాలని చూస్తున్న స్వార్థపరశక్తులకు ఊతమిచ్చే విధంగా తీర్పులోని అంశాలున్నాయనేది సామాజిక న్యాయ ఉద్యమకారుల ఆవేదన. వ్యాజ్యంలో ఇరుపక్షాలు లేవనెత్తిన అంశాలపైననే తీర్పునివ్వాలనేది న్యాయ శాస్త్ర నిబంధన. ఈ నిబంధన ప్రకారమే కోర్టులలో విచారణ సాగాలి, తీర్పులు ఇవ్వాలి అంటూ.. సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని ఆర్డర్14 నిర్దేశిస్తున్నది. స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ అనే కేసు సుప్రీంకోర్టు ముందు విచారణకు వచ్చింది. వివాదిత అంశం ఎస్సీ కులాల వర్గీకరణ కోసం మాత్రమే. వర్గీకరణ చేయడానికి అనుమతించాలంటూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తే, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వైరి పక్షం వారు వాదించారు. ఇరువురి వాదనలో ఏది సమంజసమో మాత్రమే సుప్రీంకోర్టు తేల్చిచెప్తే సరిపోయేది. కానీ వర్గీకరణే సమంజసమని గౌరవ కోర్టు తీర్పునిస్తూనే ఆశ్చర్యకరంగా.. అంతటితో ఆగిపోకుండా, ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో క్రీమీలేయర్ నిబంధనను సైతం అమలుపరచాలంటూ తీర్పునిచ్చారు. దీంతో అవాంఛనీయ వివాదాలకు తెరతీసినట్టు అయింది. వర్గీకరణ కావాలని కోరుతున్న వారు వివిధ కులాల మధ్య అంతరాలు ఉన్నవి కాబట్టి ఏకరూప వర్గాన్ని వివిధ తరగతులుగా విభజించి, సదరు తరగతుల వాటాను నిర్ణయించి, సమన్యాయం అందించాలని కోరారు తప్ప.. మాకు లేదా ఎదుటిపక్షం వారికి క్రీమీలేయర్ విధించండి అంటూ ఎవరూ కోరలేదు. అసలు క్రీమీలేయర్ అంశాన్ని తీర్పులో ప్రస్తావించే వరకు సైతం.. న్యాయ ప్రక్రియలో భాగస్వాములైన వారికి కనీసపు దానిపై ఎరుక లేదు. కనీసం ఈ అంశంలో న్యాయం చేయడం కోసం క్రీమీలేయర్‌ను సైతం మేము పరిశీలిస్తున్నామని జడ్జీలు చెప్పి ఉంటే.. హాజరైన న్యాయవాదులు తమ వాదనలు సమర్పించి ఉంటే అది కొంతమేరకు సమంజసమై ఉండేది. ఎవరూ కోరనిది, ఎవరూ వాదించనిది తీర్పులో చోటు చేసుకోవడమనేది ఏ రకంగానూ సమంజసం కాదు, న్యాయబద్ధమూ కాదు. న్యాయ శాస్త్ర పరిభాషలో ఇలాంటి ఆదేశాలను %ఱఅటతీబఞబశీబం% అంటారు. దాని అర్థం అమలుచేయ వీలులేనివి. తమ ఒక్క మాటే శాసనంగా చలామణి అవుతుందని గౌరవ న్యాయమూర్తులు గుర్తించి ఉండాల్సింది. ప్రస్తుతం ఓబీసీ వర్గాలకు అమలవుతున్న క్రీమీలేయర్ నిబంధన సైతం రాజ్యాంగ విరుద్ధమే. రాజ్యాంగంలో కానీ, మండల్ కమిషన్ సిఫారసుల్లో కానీ క్రీమీలేయర్ ప్రస్తావనే లేదు. ఇంద్ర సాహ్నీ కేసులో ఇవ్వబడిన తీర్పు కారణంగా ఈ క్రీమీలేయర్ విధానం ముందుకు వచ్చింది. క్రీమీలేయర్ కారణంగా ఇప్పటికే ఓబీసీ వర్గాలు చాలా నష్టపోతున్నాయి. 60 శాతం వరకు జనాభా ఉన్న ఓబీసీ వర్గాలకు 27% రిజర్వేషన్లు నిర్ణయించినా.. నేటి వరకు సగటున ఓబీసీలకు దక్కింది 8 శాతం మాత్రమే. మండల్ కమిషన్ అమలై 30 ఏళ్లు దాటాక, ఇంకా ఇంత తక్కువ ఓబీసీ ప్రాతినిధ్యం ఏమిటని ప్రశ్నిస్తే.. నాట్ ఫౌండ్ సూట బుల్ (%చీఖీ%) అనే సాకుని అధికార వర్గాలు ముందుకు తీసుకొస్తున్నాయి. క్రీమీ లేయర్, నాట్ ఫౌండ్ సూటబుల్ అనేవి నేటి కాలపు పురుష సూక్తంగా పనిచేసి.. ఆధునిక మనువ్యవస్థను కాపాడుతున్నాయి. ఎస్సీ వర్గంలోని వివిధ కులాల మధ్యన సైతం అంత రాలు ఉన్నాయని, అభివృద్ధిలో తేడాలు ఉన్నాయని తెలుపుతూ క్రీమీలేయర్‌ను ముందుకు తీసుకొచ్చారు. ఎస్సీ కులాల మధ్య అంతరాలు లేవని ఎవరూ వాదిం చడం లేదు.

## బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ




తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: మండలం లోని చీమలకుంటపల్లె గ్రామనికి చెందిన పోలవేని వీరయ్య ఇటీవల మరణించారు వారి కుటుంబానికి తన వంతుగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి వారి కుటుంబ సబ్యులను పరామర్శించి వారికి 50 కిలోల బియ్యాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ అద్యక్షుడు బామండ్ల ఆంజనేయులు,తాళ్లపల్లి రవి, లింగంపల్లి హరీష్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలవేని మల్లేశం, దానబోయిన లక్ష్మయ్య, కర్ర కొమురయ్య, బామండ్ల రమేష్, అనిల్, మోహన్ తిరుపతి, రమేష్, మల్లయ్య, ఆగయ్య, రాజమ్మధ్ తధితరులు పల్గొన్నారు.

# ఈ వంతెన..... అలంకారప్రాయమేనా......?

- 1.30 గుంటల విలువ 2 కోట్ల...?
- భూ నష్టపరిహారం చూసి విస్మయానికి గురవుతున్న మండల వాసులు....
- అంచనా విలువతో ప్రారంభం కానీ వంతెన.....?
- కథనాలు రాసిన కథలని అధికార యంత్రాంగం......!
- వంతెన ప్రారంభం పై ముడిపడ్డ రాజకీయం.......
- స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలని వాహనదారుల వేడుకోలు....










తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు: రామడుగు మండల కేంద్రంలోని మోతే వాగుపై ఉన్న పాత వంతెన గత కొద్ది సంవత్సరాల నుండి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆనాటి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ 7 కోట్ల 90 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించి బ్రిడ్జి పనులు పూర్తిచేసిన నేటికీ దీనిపై నిర్మించిన వంతెన రోడ్డు దాటుకుంటూ వెళ్లే వాహనదారులకు చూడడానికి అలంకారప్రాయంగా మిగిలిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనితోపాటుగా మండలంలో ఎన్నో వంతెనలు ప్రారంభించి పూర్తి చేసి వాడుకలోకి వచ్చాయి కానీ ఈ వంతెన ఇప్పటికీ....? ఇప్పటికీ ప్రారంభమయ్యేనా.....? వాహనదారులు సోషల్ మీడియా వేదికగా పలుమార్లు ప్రశ్నించిన, పత్రికల్లో కథనాలు రాసిన అధికార యంత్రాంగం మాత్రం చీమకుట్టినట్లుగా కూడా వివరించడం లేదని అసలు దీనిని ప్రారంభించకపోవడానికి అసలు కారణాలు నువ్వు నష్టపరిహార అంచనా విలువ కోట్లలో ఉన్నదని దానివల్లనే వంతెన రెండు సంవత్సరాల నుండి ప్రారంభానికి నోచుకోవడం లేదని మండల వాసులు గుసగుసలాడుతున్నారు.

**- భూ నష్టపరిహారం చూసి ఆశ్చర్యపోతున్న మండల ప్రజలు.....!**

గతంలో ఎన్ని అడుగులేని విధంగా వంతెన కింద ఎకరం 30 గుంటలకు రెండు కోట్ల రూపాయలు భూ నష్టపరిహారం ఎవరు వెలకట్టారని రామడుగు మండల ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. అంతేకాకుండా గతంలో పలు రామడుగు మండలంలో పలు ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి 23 లక్షలు చెల్లించిన సంగతి జగమెరిగిన సత్యమే. కానీ ఇక్కడ ఎకరం 30 గుంటలకు రెండు కోట్ల రూపాయలు ఎవరు వెలకట్టారని మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అందుకేనేమో ఇన్ని నెలల నుండి వంతెన సంబంధించిన భూ నష్టపరిహార విషయంలో ఆగిందా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

**- ఎమ్మెల్యే దృష్టి సారించాలని వాహనదారుల వేడుకోలు..**

వంతెనకు సంబంధించిన భూ నష్టపరిహారం ఏమో గాని నిత్యం కరీంనగర్ వెళ్లి కూలీ పని చేసుకునే మాకు వంతెన దాటాలంటే ఓ పెద్ద సావాసమే చేయాల్సి వస్తుందని నిత్యం ఈ వంతెన పై వెళ్లే వాహనదారులు మొరపెట్టుకుంటున్నారు. అంతేకాకుండా పాత వంతెన పై తాత్కాలిక మరమ్మతులు చేయడంతో కొద్దిపాటి వర్షానికే వంతెనపై బురద మయమై వాహనాలు అదుపుతప్పి వంతెన పైనుండి కింద పడిపోయే విధంగా వంతెన తయారయిందని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ఇట్టి వంతలపై దృష్టి సాధించి వంతెన పై ఉన్న రాజకీయ చిక్కుముడి విప్పి వాహనదారుల కష్టాలను తీర్చాలని వేడుకుంటున్నారు.


## అయ్యప్ప సేవా రత్న అందుకున్న కావేటి పరమేశ్వర్ గురు స్వామి





తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కావేటి పరమేశ్వర్ గురు స్వామికి అయ్యప్ప సేవా రత్న అవార్డ్ ప్రధానం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో జరిగిన "అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ" జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది గురుస్వాములకు అయ్యప్ప సేవా రత్న అవార్డులను అందించారు. ఫౌండర్, మేనేజింగ్ ఫౌండర్ ట్రస్టీ పి.ఎన్.కే మీనన్, అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు ఆధ్వర్యంలో శబరిమల అయ్యప్ప దేవాలయ మాజీ మేల్ శాంతులు శశికుమార్, దామోదరన్ నంబూద్రీ అయ్యప్ప సేవా రత్న అవార్డును కావేటి పరమేశ్వర్ స్వామికి అందించారు. ఈ సందర్భంగా కావేటి పరమేశ్వర్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో కరీంనగర్ జిల్లాలో అయ్యప్ప మాలధారణ చేసే స్వాములు, అయ్యప్ప సేవ సమితి సభ్యుల ఆశీస్సులు, సహకారంతోనే ఈ అవార్డు లభించిందన్నారు. అవార్డు రావడం సంతోషకరంగా ఉందని, ముఖ్యంగా ఈ అవార్డును జీవిత భాగస్వామి కావేటి శైలజ, కరీంనగర్ అయ్యప్ప భక్తులకు అంకితమిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. నిరంతర అయ్యప్ప స్వామి నామస్మరణతో మరింతగా అయ్యప్పకు సేవ చేసుకోవడానికి, మాల ధారణ చేపట్టే అయ్యప్పలకు తగిన తోడ్పాటును అందించడానికి, సేవ చేయుడానికి తగిన కృషి చేస్తానని గురుస్వామి కావేటి పరమేశ్వర్ ఈ సందర్భంగా తెలిపారు. తన సేవను గుర్తించి అవార్డును అందించిన కమిటీకి, సీనియర్ గురుస్వాములకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## మరణించిన వారి కుటుంబాలకు సహాయం



తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: హనుమాజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నిరుపేద సంపతి పరుశురాం ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి 50కిలోల బియ్యం వితరణ చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి ఈ కార్యక్రమంలో హన్మాజి పల్లె మాజీ సర్పంచ్ చంద్రా రెడ్డి, నాగయ్య, పరునంది సంజీవ్ తాడూరి వంశీకృష్ణారెడ్డి, లింగంపల్లి హరి, తాళ్లపల్లి రవి గౌడ్ నందికొండ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## బ్రిడ్జి కోసం వంటావార్పు




తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: మండలం లోని మైలారం గ్రామం మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ బ్రిడ్జి సాధన కమిటీ అధ్యక్షుడు సంపతి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మైసమ్మ గుట్ట వద్ద మంగళవారం వంట వార్పు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి గన్నేరువరంతోపాటు బెజ్జంకి ఇల్లంతకుంట మండలాల ప్రజలు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్ఎండి నిర్మాణంతో 9 కిలోమీటర్ల దూరం ఉన్న కరీంనగర్ 40 కిలోమీటర్ల పడింది పెరిగిందన్నారు. దీంతో ప్రజలకు దూర భారం పెరిగి విద్యా వైద్యానికి దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు రామచంద్రరావు పురంశెట్టి బాలయ్య జక్కనపల్లి సత్తయ్య సిపిఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి తోట రాజేశం నూకల తిరుపతి మద్రి వెంకట మల్లు సుద్దాల రాయమల్లు నూకల మల్లయ్య నూకల చింటూ జక్కనపల్లి రాజకుమార్ పాల్గొన్నారు.

## టెక్స్ టైల్ పార్క్ కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

తెలంగాణ క్యాపిటల్ న్యూస్ తంగళ్లపల్లి: టెక్స్ టైల్ పార్క్ లో పవర్లూమ్ కార్మికుల సమావేశం టెక్స్ టైల్ పార్క్ లోని క్యాంటీన్ వద్ద యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం టెక్స్ టైల్ పార్క్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. టెక్స్ టైల్ పార్క్ లో ఒకవైపు ఉపాధి లేక మరోవైపు బతుకమ్మ చీరల 10% యారన్ సబ్సిడీ డబ్బులు రాక కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. టెక్స్ టైల్ పార్క్ లో కార్మికులకు రావలసిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు కాలయాపన చేయకుండా వెంటనే అందించాలని సంబంధిత చేనేత జౌళి శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్ , హైదరాబాద్ చేనేత జౌళి శాఖ కమిషనర్ కి పలుమార్లు కలిసి వినతి పత్రాలు అందించిన కూడా సబ్సిడీ అందించడంలో కాలయాపన జరుగుతుందన్నారు. కార్మికుల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన టెక్స్ టైల్ పార్కులో యజమానులు ప్రభుత్వ ఆర్డర్లు వచ్చినప్పుడు మాత్రమే పరిశ్రమలను నడిపిస్తున్నారని లేకపోతే బందు పెడుతున్నారని దీనివలన కార్మికులకు సరియైన ఉపాధి దొరకక చస్తూ బతికే పరిస్థితి నెలకొన్నదని ఉపాధి మరియు సబ్సిడీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడంలో భాగంగానే ఆగస్టు – 16 శుక్రవారం రోజున



ఒక రోజు టెక్స్ టైల్ పార్క్ బంద్, పార్క్ గేట్ ముందు దీక్ష కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమాలలో టెక్స్ టైల్ పార్క్ లో పనిచేస్తున్న కార్మికులందరూ తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అక్కల శ్రీనివాస్, గడ్డం రాజశేఖర్, కారంపురి మహేష్, మేఘ ఆంజనేయులు, గోవిందు నాగయ్య, గోనె నరేష్, పులి రమేష్, కూచన రాజేష్, శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రభాకర్, సంపత్, ఆంజనేయులు, గణేష్, రాజేంద్రప్రసాద్, సాయి, జగదీష్, కిషన్, భూమయ్య, వెంకటేష్, నరహరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డేటింగ్ రూమర్స్ పట్ల అసంతృప్తిగా ఉన్న హీరోయిన్

కృతి సనన్ తన కంటే పదేళ్లు చిన్నవాడైన వ్యాపారవేత్త కబీర్ బహియాతో తనకు సంబంధం ఉందనే పుకార్లపై తన నిరాశను వ్యక్తం చేసింది. 1 నేనొక్కడినే సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఊహాగానాలకు తెరతీసింది. ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడాన్ని విమర్శిస్తూ, ఈ తప్పుడు నివేదికలు తనపై మరియు ఆమె కుటుంబంపై చూపే ప్రతికూల ప్రభావాన్ని కృతి ఎత్తి చూపారు. “మీరు నాపై తప్పుడు పుకార్లు రాస్తే, నాతో పాటు నా కుటుంబం కూడా బాధ పడుతుంది. నేను నాకంటే పదేళ్లు చిన్నవాడితో డేటింగ్ చేస్తున్నాను అని రాశారు. నిజానిజాలను పరిశీలించేందుకు ఎవరూ పట్టించుకోవడం లేదని, కొందరు తమకు తోచిన విధంగా రాయడం ఇటీవలి కాలంలో సర్వసాధారణమైపోయింది. ఇది నిజం కాదని అందరికీ వివరించడం చాలా కష్టంగా మారుతోంది” అని కృతి సనన్ పంచుకున్నారు. సోషల్ మీడియాలో ఈ ఊహాగానాలపై కృతి చాలా అసంతృప్తిగా ఉంది. ఆమె చివరిగా క్రూ చిత్రంలో కనిపించింది మరియు తదుపరి దో పట్టిలో కనిపించనుంది. ఈ సినిమా నిర్మాతల్లో ఆమె కూడా ఒకరు.



## రాజమౌళి నుండి చిన్న సినిమాకి...


# పెద్ద ఊపు



బాహుబలి మరియు - వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల వెనుక దర్శకుడు, లెజెండరీ ఫిల్మ్ మేకర్ SS రాజమౌళి చిన్న చిత్రాలకు తన మద్దతుగా పేరు గాంచాడు. ఆశాజనకమైన కొత్త సినిమాల ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లకు అతను తరచుగా హాజరవుతున్నాడు. ఈసారి రాజమౌళి చిన్న సినిమా ‘కమిటీ కుర్రోళ్లు’కి పెద్ద పీట వేశారు. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు మరియు ప్రేక్షకుల నుండి సానుకూల సమీక్షలను పొందింది, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ?7.48 కోట్ల గ్రాస్‌తో బాక్స్ ఆఫీస్ వద్ద బ్రేక్ ఈవెన్‌గా నిలిచింది. రాజమౌళి ప్రశంసలు సినిమాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చాయనడంలో సందేహం లేదు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీని తీసుకుంటూ, రాజమౌళి ‘కమిటీ కుర్రోళ్లు’ వెనుక ఉన్న బృందాన్ని అభినందిస్తూ ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. క్యాప్షన్ ఇలా ఉంది, “పెద్ద విజయం సాధించిన యువ బృందం... #committeekurrollu అని విన్నాను. దర్శకుడు యదు వంశీ, నిర్మాత నిహారిక, టీమ్ మొత్తానికి అభినందనలు! ‘కమిటీ కుర్రోళ్లు’ నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. ఇంతలో, %హూ% రాజమౌళి ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు యొక్కరాబోయే చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్‌లో పని చేస్తున్నారు, తాత్కాలికంగా SSMB29.

# ఆయన్ను చూసి అవాక్కవుతున్నారట

90ల్లో చిరంజీవి లుక్‌ని ఆనాటి యూత్ ఓ రేంజ్‌లో ఆరాధించారు. అప్పట్లో ఆయన హెయిర్ ట్కస్టైల్‌నీ.. ఆయన డ్రెస్సింగ్ ట్కస్టైల్‌నీ ఫాలో అవ్వని కుర్రాడు లేడు. సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానున్న ‘విశ్వంభర’లో మెగాస్టార్ మళ్లీ అలా కనిపించనున్నారట. ఈ లుక్ కోసం ఆయన భారీగా బరువు తగ్గడం విశేషం. అంతేకాదు, ఆనాటి హెయిర్ ట్కస్టైల్‌ని సరిగ్గా అలాగే డిజైన్ చేయించారట దర్శకుడు వశిష్ఠ. లొకేషన్లో అందరూ అప్పటి చిరంజీవిని చూస్తున్న ఫీల్‌ని ఎంజాయ్ చేస్తున్నారట. ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ ఏడెకరాల్లో ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. తన పాత్రకు డబ్బింగ్ చెప్పేందుకు వచ్చిన చిరంజీవిని చూసి అక్కడందరూ షాక్‌కి గురవుతున్నారట. ఈ నెల 22న చిరంజీవి పుట్టిన రోజు కానుకగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. టీజర్ కట్ ఇప్పటికే పూర్తయింది. కీరవాణి నేపథ్య సంగీతం, ఫైనల్ ఎడిట్ మాత్రమే మిగిలివుంది. ఈ టీజర్‌లో చిరు లుక్, విజువల్స్, వశిష్ఠ ఆవిష్కరించిన కొత్త లోకాలు.. ఆడియన్స్‌ని కట్టిపడేస్తాయని సమాచారం.




## అదిరిపోయిన “సరిపోదా శనివారం” ట్రైలర్




నాని, ప్రియాంక మోహన్, ఎస్.జె.సూర్య వంటి స్టార్ కాస్ట్‌తో వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన సినిమా “సరిపోదా శనివారం”. డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 29న విడుదల కానుంది. ఈ క్రమంలో ఆగస్ట్ 13న ట్రైలర్‌ను విడుదల చేశారు. కాగా, అంతకముందు సుదర్శన్ థియేటర్‌లో నాని అభిమానుల సమక్షంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. అభిమానుల కోలాహలంతో థియేటర్ అంతా మారుమోగింది. అభిమానుల కేరింతల మధ్య థియేటర్‌లో నాని ట్రైలర్‌ని వీక్షించారు. ఆ తరువాత తాజాగా, యూట్యూబ్‌లో ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ.. సుదర్శన్ థియేటర్‌తో తనకున్న బంధాన్ని గుర్తు చేసుకున్నాడు. ‘జెర్సీ, దసరా స్పెషల్ షోలు ఇక్కడే పడ్డాయిసు దర్శన్‌లో ఎన్నో చిత్రాలు చూశాను.. మీ అందరిలా నేను ఎన్నో చిత్రాలు చూశా.. వివేక్ ఈ ట్రైలర్‌ని నాకు చూపించాడు. ఫోన్‌లో, ఇంట్లో చూడాల్సిన ట్రైలర్ కాదని.. ఇలా సుదర్శన్‌లో అభిమానుల మధ్య చూసే ట్రైలర్ అని, ఈవెంట్ ఇక్కడ పెట్టాలని ఫిక్స్ అయ్యా..” అని అన్నాడు.

## డిమాండ్‌పై అదనపు ప్రీమియర్ షోలు!




హరీష్ శంకర్ దర్శకత్వంలో మాస్ మహారాజ రవితేజ టైటిల్ రోల్ లో నటించిన మిస్టర్ బచ్చన్ మూవీ థియేటర్ల లో రిలీజ్ కి రెడీ అయిపోయింది. రేపు ఆగస్టు 14వ తేదీ సాయంత్రం నుండి ప్రీమియర్ షోలు ప్రారంభంకానున్నాయి. అయితే కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయిన ఈ ప్రీమియర్ షోలు పబ్లిక్ డిమాండ్ మేరకు అదనంగా కొన్ని షోలు యాడ్ కానున్నాయి. రిలీజ్ కు ముందే ఈ తరహా రెస్పాన్స్ రావడం, సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది అనే నమ్మకాన్ని ఇస్తుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటించగా, మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎలాంటి రెస్పాన్స్ ను సొంతం చేసుకుంటుందో చూడాలి.